

జహీరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

ఉద్యమకారుడిని గెలిపించండి

గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రచారం

కోహీర్, మే 5: బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని 9, 10వ వార్డుల్లో గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. మహిళలకు నెలనెలా రూ.2,500, నిరుద్యోగ భృతి రూ.4 వేలు, రుణమాఫీ రూ.2 లక్షలు, కౌలు రైతులకు రూ.12 వేలు, తులం బంగారం ఏ ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. జహీరాబాద్ అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ గెలుపుతోనే సాధ్యమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో మరింత అభివృద్ధి చేసుకొనే అవకాశం లభిస్తుందన్నారు. ప్రచారంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్, షేక్ ఫరీద్, తంజీమ్, చందు, నామ రవికిరణ్ గుప్తా, అబ్దుల్లా, యాకూబ్, మోహీయోద్దీన్, బండిమోహన్, దత్తు, శ్రీనివాస్, తులసీదాస్ గుప్తా పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజల్లో విశేష ఆదరణ

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

హత్నూర, మే 5: కాంగ్రెస్, బీజేపీని నమ్మే స్థితిలో ప్రజలు లేరని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం హత్నూర మండలం సికిందాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందిన ప్రజలు నేడు ఏగ్రామానికి వెళ్లినా బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గ్రామాల అభివృద్ధికి కృషిచేసిన బీఆర్ఎస్ వెంటే ఉంటామని ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆచరణకు సాధ్యంకాని హామీలను అమలుచేస్తామని గొప్పచెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్‌ను నేడు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పథకాలు అమలుచేస్తామని చెప్పి ఐదు నెలలు గడుస్తున్నా ఏఒక్క పథకాన్ని అమలుచేయలేదని ఆరోపించారు. కళ్లాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనుగోలుకేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలుచేసి వారంరోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసినట్లు గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందనున్నట్లు ధీమా వ్యక్తంచేశారు. పార్టీలో చేరినవారిలో రామని మల్లేశం, దప్పు యాదయ్య, రమేశ్, చిరంజీవి, వెంకటేశం, కొయ్య కృష్ణ, శివరాజ్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాణిక్యరెడ్డి, శ్రీకాంత్, ఉపసర్పంచ్ యాదగిరి, నాయకులు వీరేందర్ పాల్గొన్నారు.



ఇస్రితాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కల్లబొల్లి మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, మే 5: కల్లబొల్లి మాటలు చెప్పి, అమలు కాని హామీలిచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని ఇస్రితాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మెజార్టీ వచ్చిందని, అదేవిధంగా ఎంపీ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డికి మెజార్టీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక కరెంటు కష్టాలు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటు చేసి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, ఎంపీపీ యాదమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, లక్ష్మారెడ్డి, బాబుమియా పాల్గొన్నారు.

సజావుగా నీట్

సంగారెడ్డిలోని 9 కేంద్రాల్లో పరీక్ష

98.25 శాతం హాజరు నమోదు

విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సంగారెడ్డి కలెక్టరేట్, మే 5: మెడికల్ విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ప్రశాంతంగా జరిగింది. మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 3,619 మంది విద్యార్థులకు 3,556 మంది విద్యార్థులు హాజరయ్యారు. 63 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు గైర్హాజరయ్యారు. దీంతో 98.25 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఎస్వీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 661 మందికి 672 మంది విద్యార్థులు హాజరయ్యారు. కరుణ హై స్కూల్ కేంద్రంలో 504 మందికిగాను 500 మంది, సేయింట్ పీటర్స్ హై స్కూల్‌లో 480 మందికి 473 మంది, సేయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 360 మందికి 357 మంది, సేయింట్ హై స్కూల్‌లో 360 మందికి 357 మంది, సేయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో 360 మందికి 351 మంది, పయనీర్స్ కేంద్రంలో 312 మందికి 307 మంది, ఆర్నాల్డ్స్ స్కూల్ కేంద్రంలో 288 మందికి 282 మంది, రిషీ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో 283 మందికి 268 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 3,619 మంది విద్యార్థులకు 3,556 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

అబద్ధాల కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, మే 5: అబద్ధాల హామీల పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు లోక్ సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీ, బృందావన్ టీచర్స్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు అని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన అధికార కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తే లోక్‌సభ ఎన్నికలకు ముడిపెట్టడం కాంగ్రెస్ నైజానికి అద్దం పడుతున్నదని ఎద్దేవా చేశారు. 6 గ్యారంటీలు అమలు కావాలంటే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ అందించాలని కోరారు. నాలుగేండ్లలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలో కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక స్వావలంబన అందించి అండగా నిలిచామన్నారు. ఉన్నత విద్యావంతుడు, ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

హత్నూర, మే 5: మండలంలోని చందాపూర్ బస్టాండ్ వద్ద గమ్యం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబలి కేంద్రం ప్రారంభించారు. వేసవితాపం నుంచి ఉపషమనం పొందేందుకు నాలుగేండ్లుగా అంబలి పంపిణీ చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు, సంస్థ చైర్మన్ బక్కన్నగారి సురేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీశైలం, శ్రీకాంత్, గోపాల్‌రెడ్డి, ప్రమోద్, మల్లేశం, మదుసూదన్‌రెడ్డి, నవీన్, సాయిగౌడ్, బిక్షపతి, శివ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం

జిన్నారం, మే 5: జంగంపేట గ్రామానికి చెందిన పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

బొల్లారంలోని పోచమ్మ బస్తీలో..

బొల్లారం, మే 5: మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీలో నివసించే వృద్ధురాలు లక్ష్మి(85) వయోభారంతో ఆ దివారం మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వీవీఆర్ ఫౌండేషన్ తరపున అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో యువజన నాయకులు ఇమ్రాన్, నవీన్‌రెడ్డి, జోగరామ్, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో సందడి

నృత్యం చేస్తున్న కళాకారులు

బొల్లారం, మే 5: మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఐవీ బాధిత చిన్నారుల సంరక్షణ కేంద్రం డిజైర్ సొసైటీలో వేసవి శిబిరం రెండో రోజు ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా పలు సంస్థల ఐటీ ఉద్యోగులు శిబిరంలో పాల్గొన్నారు. అబ్బాట్ పీడియా ష్యూర్ టీం డ్రాయింగ్ పోటీలు, జేపీఎంసీ హైదరాబాద్ టీం ఆటల పోటీలు, ఒరాకిల్ టీం మ్యూజికల్ చైర్, జానపద గీతాల పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జూనియర్ ఆర్టిస్టులు బాలకృష్ణ, నాగార్జున నృత్యాలతో అలరించారు. హెచ్ఐవీ బాధిత చిన్నారులను సంరక్షిస్తున్న ఫౌండర్ రవిబాబును పలు సంస్థలకు చెందిన ఐటీ ఉద్యోగులు సన్మానించి అభినందించారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 5: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ముందుంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. బీహెచ్ఈఎల్ పరిశ్రమలో పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెన్షనర్లకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ పెన్షన్లను మంజూరు చేయించామని గుర్తుచేశారు. 247మంది పెన్షనర్లకు పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ, మ్యాక్‌సొసైటీ, బీడీఎల్ కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఉన్నత విద్యావంతుడైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే పటాన్‌చెరు నియోజకవర్గం అభివృద్ధికి మరిన్ని నిధులు అందుతాయని చెప్పారు. భవిష్యత్తులోను పెన్షనర్లకు అండగా ఉంటామని, మే13న జరిగే ఎన్నికల్లో కారుకు ఓటు వేసి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సతీమణి ప్రణీతరెడ్డి, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేశ్, పరమేశ్, అంజయ్య, సత్యనారాయణ, నారాయణరెడ్డి, బూన్, యాదగిరిరెడ్డి, వైకుంఠరావు, ఫహీం, ఇక్బాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

నినాదాలు చేస్తున్న నాయకులు

న్యాల్‌కల్, మే 5: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అలే భాస్కర్‌రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని రత్నాపూర్, గంగ్వార్ గ్రామాల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ బీబీపాటిల్‌కు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాయమాటలను నమ్మి మోసపోవద్దాన్నారు. పదేండ్లుగా బీజేపీ పాలనలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్, మండల నాయకులు మల్లేశ్, రహుల్, శ్రీకాంత్, మల్లేశం పాల్గొన్నారు.

ముగిసిన టోర్నమెంట్

జిన్నారం, మే 5: మండలంలోని అండూరు గ్రామంలో పదిహేను రోజులుగా జరిగిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో గడ్డపోతారం జట్టు విజేతగా, రన్నరప్‌గా అండూరు జట్లు నిలిచాయి. విజేత జట్టుకు, రన్నరప్ జట్టుకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేత జట్టు కెప్టెన్ కార్తీక్ మాట్లాడుతూ మండల స్థాయిలో మొదటి బహుమతి అందుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. తోటి క్రీడాకారులు, గ్రామస్తులను కృతజ్ఞతలు తెలిపారు.

బీరప్ప కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే

మనూరు, మే 5: మనూరు మండల పరిధిలోని తుమ్మూర్ గ్రామంలో మూడు రోజులుగా బీరప్ప ఆలయ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన బీరప్ప కల్యాణంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, గ్రామస్తులు అశోక్‌రెడ్డి, సాయిగొండ పాల్గొన్నారు.

ఓటేసిన ఉపాధ్యాయులు

గుమ్మడిదల, మే 5: లోక్ సభ ఎన్నికల్లో ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఆదివారం గుమ్మడిదల, జిన్నారం మండలంలో ఎన్నికల డ్యూటీలు నిర్వహించే ఉపాధ్యాయులు, అధికారులు పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకొని ఓటు వేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎన్నికల ప్రచారంలో మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి, మే 5: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మునిపల్లిలోని ఓ పంక్షన్ హాలులో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, తదితరులు పాల్గొన్నారు.

సురేశ్‌షెట్కార్‌ను గెలిపించాలి

న్యాల్‌కల్, మే 5: జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సురేశ్‌కుమార్ షెట్కార్‌ను మరోసారి ఎంపిగా గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని రాఘవపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దాన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, ఎంపీపీ వైస్ చైర్మన్ గౌసుద్దీన్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం

కోహీర్, మే 5: మండలంలోని బడంపేట, గొటిగార్‌పల్లి, పర్సపల్లి, మనియార్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఎంపీటీసీ మల్లన్న, హర్షద్, రాచయ్య, చంద్రప్ప, అక్షయ్ జాడే, తదితరులు పాల్గొన్నారు.

కేరూర్‌లో విషాదం

చేపల వేటకు వెళ్లి ఒకరు.. వెతికేందుకు వెళ్లి మరొకరు మృతి

కిరణ్(ఫైల్)

కిష్టయ్య(ఫైల్)

వట్‌పల్లి, మే 5: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందగా, అతడిని వెతికేందుకు వెళ్లిన మరో వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై కోటేశ్వర్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేరూర్ గ్రామానికి చెందిన బురుగు కిరణ్(24) శనివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆదివారం తెల్లవారుజామున ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన చిన్నేల్లి కిష్టయ్య(55) చెరువులోకి దిగి కిరణ్ మృతదేహం కోసం వెతికేక్రమంలో ప్రమాదవశాత్తు కిష్టయ్య సైతం చెరువులో మునిగి మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యాలు చేపట్టి ఇద్దరి మృతదేహాలు వెలికితీశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న వ్యక్తి మృతి

అమీన్ పూర్, మే 5: బైక్‌ను వేగంగా, అజాగ్రత్తగా నడిపిన ఓ వ్యక్తి డివైడర్‌కు ఢీకొని మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలం బొమ్మనుకుంట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్(36), పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 3న బైక్‌పై జానకంపేట వైపుగా ఇంటికి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో భీరంగూడ బచ్‌పన్ స్కూల్ వద్ద వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తల, నుదురు ఛాతి భాగాల్లో బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి అశోక్‌నగర్‌లోని మెడికవర్ దవాఖానకు తరలించారు. శనివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీఆర్ఎస్ నేతల ముమ్మర ప్రచారం

- ఇంటింటికీ గులాబీ నేతలు

జిన్నారం: ఊట్లలో ప్రచారం చేస్తున్న జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, వెంకటేశంగౌడ్, తదితరులు

కందిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం, మే 5: మెదక్ బీఆర్ఎస్ లోక్ సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీవైస్ చైర్మన్ కె.ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని ఊట్ల, దాదిగూడ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

నల్తూరులో..

జిన్నారం, మే 5: మండలంలోని నల్తూరు గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ హాజరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్, చెట్టి శివరాజ్, రవీందర్, నాయకులు భీమ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ పాల్గొన్నారు.

కందిలో..

కంది, మే 5: మండల కేంద్రమైన కందిలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటు వేయాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేసి మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు ఆనంద్‌రావు, రవి, మోహన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, నందకిశోర్ పాల్గొన్నారు.

బొల్లారంలో..

బొల్లారం, మే 5: మెదక్ లోక్ సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీగా వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు.

రమచంద్రాపురంలో..

రామచంద్రాపురం, మే 5: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీకి సంబంధించిన బూత్‌స్థాయి సమావేశం ఆదివారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి నివాసంలో జరిగింది. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ బలంగా ఉండాలని సూచించారు. ఓల్డ్ ఎంఐజీలో ప్రచారాన్నిమ ముమ్మరం చేయాలని, ప్రతి ఓటరును కలిసి పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించాలని కార్పొరేటర్ బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: బీఆర్ఎస్ నాయకులతో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

బొల్లారంలో ఇంటింటి ప్రచారంలో